బస్తీ దవాఖానా ఆకస్మిక తనిఖీ


సిబ్బందితో మాట్లాడుతున్న కార్పొరేటర్ శాంతి

మల్లాపూర్: నాచారం ఎర్రకుంట సీడీఎస్ భవనంలోని బస్తీ దవాఖానాను సోమవారం నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు బస్తీదవాఖానాలో అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. గత కొద్దిరోజులుగా డాక్టర్ రావడం లేదని, స్టాఫ్‌నర్సు మాత్రమే ఉంటుందని తెలియడంతో వెంటనే ఉప్పల్ హెల్త్ సూపర్‌వైజర్ ప్రకాష్ భోగాతో మాట్లాడారు. త్వరలోనే డాక్టర్‌ను బస్తీ దవాఖానాలో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. బీఆర్ఎస్ నేతలు సాయిజెన్‌శేఖర్, ముత్యంరెడ్డి, టేకులపల్లి రాంచందర్, శివకుమార్, యాదగిరి, మల్లికార్జున్‌గౌడ్, యూసఫ్, ఈశ్వర్, శ్రీనివాస్, నరసింహ, భాను, బాలరాజ్, ఖాదర్ తదితరులున్నారు.

ప్లీనరీకి తరలిన ఉద్యమకారులు


ఉద్యమకారులతో కార్పొరేటర్ శాంతి

అల్వాల్: తెలంగాణ ఉద్యమకారుల ప్లీనరీ సభకు అల్వాల్ నుంచి ఉద్యమకారులు బయలుదేరారు. ఈ సందర్భంగా సోమవారం కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి వారికి సంఘీభావం తెలిపి, ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉద్యమకారులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను సత్వరమే పరిష్కరించాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. శోభన్‌బాబు, దోలి సుధీర్ తదితరులున్నారు.

రజతోత్సవ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


రజతోత్సవసభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ సునీత

గౌతంనగర్: 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కార్పొరేటర్ మేకల సునీతారాముయాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం గౌతంనగర్‌లోని కార్పొరేటర్ కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రజతోత్సవ సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వరంగల్‌లో జరిగే సభకు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, అభిమానులు, నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలి వెళ్లడానికి సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. నాయకులు మేకల రాముయాదవ్, పార్టీ నాయకులు తదితరులున్నారు.

రజతోత్సవ సభకు మద్దతుగా ఆటోడ్రైవర్ల ర్యాలీ



మల్లాపూర్: 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఆటోయూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య పిలుపునిచ్చారు. సోమవారం ఆటోలతో నాచారం వైజయంతి నుంచి హెచ్ఎంటీనగర్ కమాన్ వరకు ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆటోడ్రైవర్లు అంతా భారీ ఎత్తున తరలివెళ్లి సభను విజయవంతం చేద్దామన్నారు. శాతం రమేష్, ఆహ్మద్, వెంకటేష్, రమేష్‌కుమార్, అజార్, గోపాల్, ఎల్లయ్య, ఎర్రం శ్రీనివాస్, రామాంజనేయులు, సాయికుమార్, డ్రైవర్లు తదితరులున్నారు.

వ్యక్తి అదృశ్యం


రామ్మోహన్

అల్వాల్: వ్యక్తి అదృశ్యమైన ఘటన నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సఫిల్‌గూడ నవభారత్ కాలనీలో నివసించే రామ్మోహన్ (42), ఓ కారు షోరూమ్‌లో పనిచేస్తున్నాడు. ఈనెల 19న పనికిషోరూమ్‌కు వెళ్తున్నానని ఇంట్లో చెప్పితిరిగిరాలేదు. దీంతో కుటుంబసభ్యులు తెలిసిన చోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్‌వాడీలు మరింత బలోపేతం

- పనితీరు ఆధారంగా గ్రేడింగ్‌పై కసరత్తు
- టీచర్లకు ఏ ప్లస్, ఏ, బీ, సీ గ్రేడింగ్
- మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో 793 కేంద్రాలు
- 1.07 లక్షల మంది లబ్ధిదారులు



సాక్షి,సిటీబ్యూరో: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతంపై దృష్టి సారిస్తోంది. చిన్నారులు, బాలింతలు, గర్భిణీలకు మరింత నాణ్యమైన సేవలు అందించే దిశగా అడుగులేస్తోంది. దీనికోసం అంగన్‌వాడీల పనితీరు మెరుగుపరిచేందుకు గ్రేడింగ్ విధానాన్ని అమలు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. రాష్ట్ర మహిళా, శిశుసంక్షేమశాఖ మంత్రి సీతక్క ఆయా శాఖల ఉన్నతాధికారులతో ఇటీవల నిర్వహించిన సమావేశంలో ఈ అంశంపై చర్చించారు. గ్రేడింగ్ ఆధారంగా అంగన్‌వాడీ కేంద్రాలకు అవార్డులు ప్రకటిస్తామని చెప్పారు. తద్వారా ఎప్పటికప్పుడు అంగన్‌వాడీ కేంద్రాలు అప్‌గ్రేడ్ అయ్యేందుకు అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

కేంద్రాలతో పాటు.. టీచర్లకూ..

అంగన్‌వాడీల్లో వసతులు, లబ్ధిదారులకు అందుతున్న సేవల ఆధారంగా కేంద్రాలతో పాటు టీచర్ల పనితనానికి గ్రేడింగ్ ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. టీచర్లకు ఉన్న టీచింగ్ సామర్థ్యాలు, అభ్యాసన సామగ్రిపై అవగాహన ఆధారంగా ఏ ప్లస్, ఏ, బీ, సీ కేటగిరీలుగా గ్రేడ్లు కేటాయించనున్నట్లు తెలుస్తోంది. ఈ గ్రేడ్‌ల ఆధారంగానే అవార్డులు ఇవ్వనున్నారు. తక్కువ గ్రేడ్లు పొందిన టీచర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాల ద్వారా మెరుగుపర్చాలని ప్రభుత్వం భావిస్తోంది.

793 కేంద్రాల్లో 1.07 లక్షల మంది..

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో 793 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. ఇందులో 6 నెలల నుంచి ఆరేళ్ల పిల్లలు 90, 361 మంది, గర్భిణీలు, బాలింతలు 17,123 మంది ఉండగా.. మొత్తంగా 1,07,484 మంది ఉన్నారు. వీరిలో కుత్బుల్లాపూర్ ప్రాజెక్టు పరిధిలో 311 కేంద్రాలు ఉండగా.. 47,028 మంది పిల్లలు, గర్భిణీలు, బాలింతలు, మేడ్చల్‌లో 211 అంగన్‌వాడీ కేంద్రాల్లో 39,463 మంది, అల్వాల్ పరిధిలో 271 అంగన్‌వాడీ కేంద్రాల్లో 20,993 మంది పిల్లలు, గర్భిణీలు, బాలింతలు ఉన్నారు.

వసతుల సంగతేంటి..

అంగన్‌వాడీ కేంద్రాలు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. కేంద్రాల నిర్వహణకు ప్రభుత్వం చెల్లించే అద్దెలు తక్కువగా ఉండటంతో ఇరుకు గదుల్లో కేంద్రాలను నడిపించాల్సిన దుస్థితి ఉంది. జిల్లాల్లో చాలా వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస సదుపాయాలు లేవు. దీంతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు కేంద్రాలకు రావాలంటేనే ఆలోచిస్తున్నారు. కేంద్రాల్లో సరిపోను ఫ్యాన్లు లేకపోవడంతో వేసవిలో ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్నారు. మరో వైపు కేంద్రాల్లో తాగునీరు కూడా అందుబాటులో లేదు.

తాగు నీటికి ఇబ్బందే..

మేడ్చల్, మల్కాజిగిరిజిల్లాలో 793 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. ఇందులో 117 కేంద్రాలలో తాగునీరు తదితర సౌకర్యాలు లేవు. మేడ్చల్ ప్రాజెక్టు పరిధిలో 211 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, అత్యధికంగా 77 కేంద్రాల్లో తాగునీటి సదుపాయం లేదు. అల్వాల్ ప్రాజెక్టు పరిధిలో 40 కేంద్రాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది.

118 కేంద్రాల్లో టాయిలెట్ల సమస్యే..

- జిల్లాలో మొత్తం 793 అంగన్‌వాడీ కేంద్రాలకు 118 కేంద్రాల్లో టాయిలెట్లు లేవు. ఇందులో మేడ్చల్ ప్రాజెక్టు పరిధిలో 78, అల్వాల్ ప్రాజెక్టు పరిధిలో 51, కుత్బుల్లాపూర్ ప్రాజెక్టు పరిధిలో 40 అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల సమస్య తీవ్రంగా ఉంది.
- అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం ఇచ్చే అద్దె చాలా తక్కువ కావడంతో ఓనర్లు టాయ్‌లెట్లు నిర్మించి ఇచ్చే పరిస్థితి లేదు.

సొంత భవనాలు లేనివి 443 కేంద్రాలు..

జిల్లాలోని 793 అంగన్‌వాడీ కేంద్రాల్లో 212 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. ఇవి కాకుండా దాతలు ఉచితంగా ఇచ్చిన 138 భవనాల్లో కూడా అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. మిగిలిన 443 అంగన్‌వాడీ కేంద్రాలు మాత్రం అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. కుత్బుల్లాపూర్ ప్రాజెక్టు పరిధిలో 311 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, అత్యధికంగా 277 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. అల్వాల్‌లో 271 కేంద్రాల్లో 143 కేంద్రాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. మేడ్చల్‌లో 211 అంగన్‌వాడీ కేంద్రాలకు 23 మాత్రమే అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.

మూడు నెలలుగా జీతాల్లేవ్..

ఇబ్బంది పడుతున్న 1962 పశు సంచార వైద్య సిబ్బంది



కీసర: మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా పశు సంచార వైద్య సేవలు అందిస్తున్న 1962 సిబ్బందికి గత మూడు నెలలుగా జీతాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, జిల్లా పశుసంచార వైద్య వాహన సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమవారం వారు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 1962 ఉద్యోగులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని, ప్రభుత్వం గత మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోయినప్పటికీ తాము మూగజీవాలకు వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సిబ్బందికి జీతాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మేడ్చల్: మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని మేడ్చల్ 1962 వాహన సిబ్బంది కోరారు. 1962 వాహనంతో జిల్లాలో పర్యటిస్తూ.. పశువులకు సేవలు అందిస్తుండగా ప్రభుత్వం వేతనాలను మూడు నెలలుగా ఇవ్వడం లేదని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. తమ బతుకు భారం కాకముందే వేతనాలు చెల్లించాలని కోరారు.

అంబేడ్కర్ టూరిజం భవనానికి స్థలం మంజూరు చేయండి

కీసర: రామలింగేశ్వరస్వామి దేవస్థానం సమీపంలో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ టూరిజం భవన నిర్మాణానికి స్థలం మంజూరు చేయాలని కీసర మండలం అంబేడ్కర్ సంఘం నాయకులు 1000 మంది సంతకాలతో సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ప్రజావాణిలో జాయింట్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు కొమ్ము సుదర్శన్, ప్రధాన కార్యదర్శి తుదుం శ్రీనివాస్‌లు మాట్లాడుతూ.. మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో అణగారిన వర్గాల ప్రజల కోసం కీసర గుట్టపై అంబేడ్కర్ భవనం నిర్మించాలని కోరుతూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అన్ని వర్గాల వారికి భవనాలు, సదుపాయం ఉందని, తమకు భవనం లేదని, బ్రహ్మోత్సవాలకు వచ్చే వారికి ఇతర కార్యక్రమాలు చేసేందుకు సర్వేనెంబర్-200, 201లో రెండెకరాల ప్రభుత్వ స్థలాన్ని అంబేడ్కర్ టూరిజం భవనం కోసం అనుమతించి, మంజూరు చేసి ప్రభుత్వం నుంచి ఇప్పించాలని కోరారు.

మాదకద్రవ్యాలపై అప్రమత్తంగా ఉండాలి

కాప్రా: మాదకద్రవ్యాల వినియోగంపై యువత అప్రమత్తంగా ఉండాలని అదనపు డిప్యూటీ కమిషనర్ వెంకటరమణ అన్నారు. సోమవారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జిమ్‌లలో పోలీసు అధికారులు ఆకస్మిక తనిఖీ చేశారు. జిమ్‌కు వెళ్లే వారు ఎలాంటి మాదకద్రవ్యాలు, డ్రగ్స్ తీసుకోవద్దని సూచించారు. మాదకద్రవ్యాల పట్ల సమాజం అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఏసీపీ మహేష్, ఎస్‌హెచ్‌ఓ భాస్కర్‌రెడ్డి, ఎస్సైలు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికసాయం

ఘట్‌కేసర్: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు ఎన్ఎఫ్‌సీనగర్ సన్‌రైజ్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు అండగా నిలిచారు. భువనగిరి మండలం, తాజ్‌పూర్ గ్రామానికి చెందిన మాపురం కొండల్ రెండు కిడ్నీలు పాడై నిమ్స్ ఆసుపత్రిలో చేరాడు. పేద కుటుంబం కావడంతో ఆదుకోవాలని ట్రస్ట్ సభ్యులు వీరారెడ్డి, రమేష్‌ను సంప్రదించగా.. ట్రస్ట్ తరపున రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు. ట్రస్ట్ సభ్యులు సుందర్‌రావు, సోమయ్య, ఐలయ్య, బంగారుబాబు, రమేష్ పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన ర్యాలీ

మేడ్చల్: పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని కిష్టాపూర్‌లోని విభా స్కూల్ విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. 'పోషణ పరిరక్షణ' పేరుతో ర్యాలీ చేపట్టారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పోషకాహారంపై అవగాహన కల్పించారు. స్కూల్ ప్రిన్సిపాల్ విజయభారతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పరిష్కారానికి నోచుకోక..

మళ్లీ ఫిర్యాదులు చేస్తున్న ప్రజలు

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం మీటింగ్‌హాల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. తమ సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవటంతోనే తిరిగి ఫిర్యాదు చేస్తున్నట్లు ప్రజలు చెబుతున్నారు.

- వివిధ ప్రాంతాలు, బస్తీలు, గ్రామాల నుంచి వచ్చిన పలువురు ప్రజలు, మహిళల సంక్షేమ పథకాలకు సంబంధించి పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల కోసం ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నారు. భూ కబ్జాలు, ప్రభుత్వ, అసైన్డ్ భూముల ఆక్రమణలపై 27 ఫిర్యాదులు రాగా.. పురపాలక సంఘాల్లో అక్రమ భవన నిర్మాణాలు, అనుమతి లేకుండా బహుళ అంతస్తుల కట్టడాలపై అత్యధికంగా 37 ఫిర్యాదులు వచ్చాయి.
- పోచారం, నాగారం, దమ్మాయిగూడ, ఫీర్జాదిగూడ, మేడ్చల్, ఘట్కేసర్, జవహర్‌నగర్, కొంపెల్లి, తూముకుంట పురపాలక సంఘాలతో పాటు గాజులరామారం, కుత్బుల్లాపూర్, అల్వాల్ మున్సిపల్ సర్కిళ్లకు సంబంధించిన వాటిపై పెద్దఎత్తున ఫిర్యాదులు ప్రజావాణిలో వచ్చాయి.
- డీఆర్‌డీఏకు 11, విద్యాశాఖకు 6 , ఇరిగేషన్‌పై 4 , జిల్లా సంక్షేమశాఖకు 3 , డీసీఓకు 3, డీసీడీఎస్‌కు 5 , హౌసింగ్‌కు 1, పంచాయతీశాఖ, మల్కాజిగిరి, కీసర ఆర్డీఓలు, మెప్మా, పోలీస్‌శాఖలకు సంబంధించిన వాటితో సహా మొత్తంగా ప్రజావాణిలో పెద్దఎత్తున 106 ఫిర్యాదులు అధికారులకు అందజేశారు. డీఆర్‌ఓ హరిప్రియ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



తక్షణమే పరిష్కరించాలి

ప్రజలు అందించే వినతులను సంబంధితశాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలి. వినతులకు సంబంధించిన సమాచారాన్ని ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. ప్రజావాణి అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూనే సమస్యలకు పరిష్కారం చూపాలి.

– విజయేందర్‌రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్

చీర్యాల బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

24 నుంచి 27 వరకు జరగనున్న ఉత్సవాలు

కీసర: చీర్యాల లక్ష్మీనృసింహ్మాస్వామి దేవస్థానంలో ఈనెల 24 నుంచి 27వ తేదీ వరకు సప్తదశ (17)వ వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ఆలయ చైర్మన్ లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరిగౌడ్ అన్నారు. సోమవారం దేవాలయం వద్ద బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రిక, ప్రత్యేక పూజల కరపత్రికను విడుదల చేశారు. ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, ధర్మకర్తలు శ్రీహరిగౌడ్ మాట్లాడుతూ.. భక్తుల కొంగుబంగారంగా పేరొందిన చీర్యాల లక్ష్మీనృసింహ్మాస్వామి బ్రహ్మోత్సవాలకు విచ్చేయనున్న వేలాదిమంది భక్తుల కోసం అన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు.



వ్యర్థాలు తొలగించడం లేదని ఫిర్యాదు


డీసీకి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్, స్థానికులు

మల్కాజిగిరి: సర్కిల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. సోమవారం డివిజన్ పరిధిలోని విమలాదేవినగర్, విష్ణుపురికాలనీ ప్రాంతానికి చెందిన మహిళలు సత్య, శారదలు కార్పొరేటర్ శ్రవణ్‌తో కలిసి ప్రజావాణిలో డీసీని కలిశారు. చెట్లకొమ్మలు తొలగించడానికి సంబంధిత విభాగం సూపర్‌వైజర్ డబ్బులు తీసుకున్నాడని ఆరోపించారు. వ్యర్థాలు తొలగించలేదని ప్రశ్నిస్తే అసభ్యకరంగా మాట్లాడుతున్నాడని ఫిర్యాదు చేశారు. దోమల బెడద ఎక్కువగా ఉందని, అనేక సార్లు ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. కార్పొరేటర్ శ్రవణ్ మాట్లాడుతూ.. 'జీతాలు తీసుకుంటున్న అధికారులు, సిబ్బంది చేయాల్సిన పనికూడా చేయడం లేదని అటువంటి అధికారులు విధుల్లో ఉండటం కంటే మానుకోవడం ఉత్తమమని' కార్పొరేటర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

జైబాపు, జై భీమ్, జై సంవిధాన్ ర్యాలీ





కాప్రా: అంబేడ్కర్‌ను అవమానించేలా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లో చేసిన వ్యాఖ్యలకు నిరసనగా చర్లపల్లిలో భారీర్యాలీ చేపట్టారు. స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి ఆధ్వర్యంలో సోమవారం జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంబేడ్కర్‌ను అవమానించేలా మాట్లాడిన అమిత్‌షా తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మన రాజ్యాంగాన్ని అవమానించేలా బీజేపీ, దాని అనుబంధ సంస్థలు చేస్తున్న దాడులను క్షేత్రస్థాయి నుంచి తిప్పికొట్టాలనే రాహుల్‌గాంధీ ఆదేశాలతో సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మందముల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టినట్లు ఆమె పేర్కొన్నారు.

భారతరాజ్యాంగాన్ని కాపాడదాం..

రామంతాపూర్: ఇందిరానగర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జై బాపు, జైభీమ్, జైసంవిధాన్ ర్యాలీలో ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అమలు చేస్తున్న సన్నబియ్యం పథకం పేదలకు వరంగా మారిందని, సీఎం రేవంత్‌రెడ్డి పేదల పక్షపాతిగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టి అమలుచేస్తున్నారన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్, మన రాజ్యాంగాన్ని అవమానించే బీజేపీ దాని అనుబంధ సంస్థలు రాజ్యాంగంపై దాడులు చేస్తున్నాయని ఆరోపించారు. ఈ దాడులు క్షేత్రస్థాయి నుంచి తిప్పికొట్టి భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నేతలు రఫీక్, శ్రీకాంత్‌యాదవ్, అరుణ్, సుధాకర్, జంగయ్య, రాజిరెడ్డి, ఉపేందర్‌రెడ్డి, జలీల్‌పాషా, సందీప్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులే మార్గదర్శకులు



పదవీవిరమణ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి

ఉప్పల్: ప్రతి పాఠశాలలోని విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు మార్గదర్శకులుగా ఉన్నప్పుడే ఆ పాఠశాల అభివృద్ధి చెందుతుందని, జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి అన్నారు. ఉప్పల్ జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేసి పదవీవిరమణ పొందిన వెంకటేశ్వర్‌ను డీఈవో శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆయన ప్రధానోపాధ్యాయుడిగా ఉన్న సమయంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించారని కొనియాడారు. సీఎస్ఆర్‌లో భాగంగా పాఠశాలలో సీసీ కెమెరాలు, బాలికలకు ప్రత్యేక టాయిలెట్స్ ఏర్పాటు చేయడం లాంటి అనేక కార్యక్రమాలను అమలు చేసి పాఠశాల అభివృద్ధికి నిరంతరం కృషి చేశారన్నారు. ఇలాంటి ప్రధానోపాధ్యాయులు అరుదుగా ఉంటారని కొనియాడారు. బాపూజీ ట్రస్టు సభ్యులు, సాయి సేవాద్రి ఆశ్రమం ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ పరిధిలో రూ.70 లక్షలతో నిర్మిస్తున్న వరద నీటి కాలువ నిర్మాణ పనులను కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్‌ముదిరాజ్ అధికారులతో కలిసి పరిశీలించారు. సోమవారం పర్యటించిన ఆమె మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని అధికారులకు సూచించారు. వరద నీటి కాలువ సరిగ్గా లేని కారణంగా స్థానికులు అనేక ఇబ్బందులు పడ్డారని, ఇక నుంచి ఆ సమస్య ఉండదన్నారు. దాదాపుగా 15 కాలనీలకు వరద ముప్పు తప్పుతుందని గుర్తు చేశారు. జీహెచ్ఎంసీ అధికారులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.


వరదనీటి కాలువ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ గీత

భూ భారతిపై ఎవరికి అవగాహన ?


సదస్సుకు హాజరైన రాజకీయ నాయకులు

సదస్సులో రైతుల కంటే నాయకులే అధికం

మేడ్చల్: ప్రభుత్వం ధరణి వ్యవస్థను రద్దుచేస్తూ నూతనంగా రూపొందించిన భూ భారతి చట్టంపై ఎవరికి అవగాహన కల్పించారో తెలియడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధి అత్వెల్లి జీఎస్ఆర్ కన్వెన్షన్‌లో భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో రైతులకు నూతన చట్టంపై పూర్తి అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో సదస్సు ఏర్పాటు చేసినా.. సదస్సులో రైతుల కంటే నాయకులే అధికంగా కనిపించారు. పదుల సంఖ్యలో రైతులు ఉన్నా.. వారు వేదికకు చాలా దూరంగా ఉండిపోయారు.

- మంత్రి శ్రీనివాస్‌రెడ్డి ధరణి వల్ల రైతులు ఎలా ఇబ్బందులు పడ్డారో వేదిక వద్ద ఉన్న రైతులు తమ అనుభవాలు తెలపాలని కోరగా.. రాజకీయ నాయకులు రైతుల పేరుతో రాజకీయ ఉపన్యాసాలు చేశారనే విమర్శలు ఎదురౌతున్నాయి.


స్వల్పంగా కనిపిస్తున్న రైతులు

- రాజకీయ ఉపన్యాసాలు వద్దని ధరణి వల్ల ఎదుర్కొన్న ఇబ్బందులు చెప్పాలని మంత్రి పదే పదే కోరినా రైతులమని, కాంగ్రెస్ నాయకులే మైకులు తీసుకోవడంతో అవగాహన ఎవరికి కల్పించారో తెలియని పరిస్థితి ఏర్పడింది. మొత్తంగా రాజకీయ నాయకుల అత్యుత్సాహం , అధికారుల నిర్లక్ష్యంతో భూ భారతిపై అవగాహన సదస్సు రైతులకు అందలేకుండా పోయిందనే విమర్శలున్నాయి.